క్లుప్తంగా

హాస్టల్ ఏర్పాటు చేయాలని హరీశ్‌రావుకు వినతి



హరీశ్‌రావుకు వినతి పత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం హాస్టల్ వసతి కల్పించాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు గురువారం ఎమ్మెల్యే హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. చిన్నకోడూరులో హాస్టల్ వసతి కల్పిస్తే కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని వివరించారు.

విద్యార్థినికి జువేరియాకు రూ.10వేల నజరానా



చెక్‌ను చూపుతున్న జువేరియా

వర్గల్(గజ్వేల్): పదో తరగతిలో మండల టాపర్‌గా నిలిచిన మైలారం జెడ్పీహైస్కూల్ విద్యార్థిని జువేరియా(558)ను అభినందిస్తూ గురువారం ఆ పాఠశాల ఉపాధ్యాయుడు పర్వతం నర్సయ్య రూ.10 వేలు నజరానా అందజేశారు. మెరిట్ విద్యార్థులకు గ్రామ నాయకుడు పోతగల్ల రవి మెమెంటోలు అందజేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్య

చేర్యాల(సిద్దిపేట): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అందుతోందని సీడీపీఓ రమాదేవి అన్నారు. స్థానిక 11వ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ కృష్ణవేణి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీసుకునే ఆహారంలో ఆకుకూరలు, పండ్లు, ఐరన్ కలిగిన పదార్థాలు, పాలు, గుడ్లు కచ్చితంగా ఉండాలన్నారు. ఆయా రాజమణి, తల్లులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్(దుబ్బాక): అంగన్‌వాడీ కేంద్రాలల్లోనే చిన్నారులకు పౌష్టికాహారం అందుతోందని, బడిఈడు పిల్లలను బడికి పంపాలని ఐసీడీఎస్ ఇందుప్రియాల్ సూపర్‌వైజర్ అన్నారు. ఇందుప్రియాల్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలను తప్పనిసరిగా కేంద్రాలకు పంపించాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు మంజుల, మహ్మద్ సుల్తానా, సువర్ణ పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్‌ల నిర్వహణ

మిరుదొడ్డి(దుబ్బాక): అమ్మ మాట- అంగన్‌వాడీ బాట వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ కిచెన్ గార్డెన్ కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులతో చైల్డ్ ఫ్రెండ్లీ వాతావరణం నెలకొల్పేలా కిచెన్ గార్డెన్‌లో ఆట, పాటలతో గడిపారు.

ఉత్సాహంగా వాకథాన్



ర్యాలీలో పాల్గొన్న మెడికల్ విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నేషనల్ సర్జన్ వీక్‌ను పురస్కరించుకుని సురభి మెడికల్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో గురువారం వాకథాన్ చేపట్టారు. 9 నుంచి 15 వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమాలలో భాగంగా ఈ వాకథాన్ చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా పట్టణంలో మొక్కల పెంపకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీన్ రఫీ, సర్జరీ ప్రొఫెసర్ ఐలయ్య, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సమావేశానికి విశేష స్పందన



హాజరైన తల్లిదండ్రులు, స్థానికులు

చిన్నకోడూరు: గోనెపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి విశేష స్పందన లభించింది. డ్వాక్రా మహిళలు, విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. హెచ్‌ఎం రవీందర్ మాట్లాడుతూ పిల్లల చదువుకు భరోసా కల్పిస్తామన్నారు. పాఠశాలల బలోపేతానికి దాతలు సహకరించాలని కోరారు. నాయకులు కూర నరేందర్‌రెడ్డి, రాజేందరెడ్డి, మాజీ సర్పంచ్ స్వరూపఎల్లాగౌడ్, థెరిసానగర్ స్కూల్ హెచ్‌ఎం శారద, శంకరాయకుంట హెచ్‌ఎం మహేందర్, ఉపాధ్యాయులు వేణు, గణేశ్, శోభారాణి పాల్గొన్నారు.

బడిగంట మోగింది

వేసవి సెవుల అనంతరం చిన్నారులు పాఠశాలల బాట పట్టారు. బడిగంట మోగడంతో నిన్న, మొన్నటి వరకు ఆటపాటలతో గడిపిన విద్యార్థులు గురువారం బడుల్లోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పాఠశాలలను మామిడి తోరణాలు, బెలూన్లతో అలంకరించి విద్యార్థులకు స్వాగతం పలికారు. యేడాది విద్యార్థులకు అందజేయాల్సిన యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు ఇప్పటికే అన్ని స్కూళ్లకు అందాయి.



చిన్నకోడూరు(సిద్దిపేట): రామంచలో విద్యార్థులు, తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు



నంగునూరు(సిద్దిపేట): తమకు అందజేసిన యూనిఫారాలు, పుస్తకాలను చూపుతున్న మగ్దుంపూర్ పాఠశాల విద్యార్థులు



మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డిలో పాఠశాలకు తరలి వస్తున్న చిన్నారులు



మిరుదొడ్డి(దుబ్బాక): జ్యూస్‌తో విద్యార్థులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయులు



జగదేవ్‌పూర్(గజ్వేల్): విద్యార్థిని పాఠశాల వద్ద దించి టాటా చెప్తున్న తండ్రి



హుస్నాబాద్‌రూరల్: పోతారం(ఎస్) పాఠశాలలో పువ్వులతో విద్యార్థులకు స్వాగతం



మద్దూరు(హుస్నాబాద్): చిన్నారులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ రామ్మోహన్



కొమురవెల్లి(సిద్దిపేట): ప్రత్యేక అలంకరణలో రసులాబాద్ పాఠశాల



దుబ్బాక: మల్లాయపల్లిలో మూతపడిన పాఠశాలను ప్రారంభిస్తున్న ఎంఈఓ ప్రభుదాసు, ఉపాధ్యాయులు



గజ్వేల్‌రూరల్: బెజుగామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో డీజీఎఫ్ నేత వేణు తదితరులు



కొండపాక(గజ్వేల్): దుద్దెడలో పాఠ్యపుస్తకాలు అందజేసిన హెచ్‌ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు

పాఠశాల పున: ప్రారంభం

మర్కూక్(గజ్వేల్): కొన్నేళ్లుగా మూతపడిన పాఠశాల ఎట్టకేలకు తెరుచుకుంది. గ్రామ యువకులు, మహిళా సంఘం సభ్యులు పాఠశాల పున: ప్రారంభానికి కృషిచేశారు. మండలంలోని గంగాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో ఎనిమిదేళ్లుగా మూసివేశారు. ఈ క్రమంలో యువకులు, మహిళా సంఘాల సభ్యులు ఎంఈఓ వెంకట్‌రాములును ఒప్పించి రాష్ట్ర ఎస్‌ఎస్సీ బోర్డు డైరెక్టర్ కృష్ణారావు, కమ్యూనిటీ మొబలైజింగ్ అధికారి రంగనాథ్ చేతుల మీదుగా గురువారం 15 మంది విద్యార్థులతో ప్రారంభింపజేశారు. త్వర లోనే పాఠశాలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని వారు హామీ ఇచ్చారు.

భూ సర్వేకు నిరాకరణ

హుస్నాబాద్‌రూరల్: అక్కన్నపేట మండలం చౌటపల్లిలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు స్థల సేకరణకు వచ్చిన రెవెన్యూ అధికారులను రైతులు అడ్డుకున్నారు. తమ భూముల సర్వేకు నిరాకరించారు. పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం 105 ఎకరాలను సేకరిస్తుంది. అందులో భాగంగా అధికారులు గురువారం తోటపల్లి శివారులోని 27 ఎకరాల పట్టా భూములను సర్వే చేయడానికి వెళ్లారు. దీంతో రైతులు అడ్డుకొని తమ భూములను ఇవ్వబోమని చెప్పారు. దీంతో రెవెన్యూ అధికారులు వెనుతిరిగారు.

వీధికుక్క దాడిలో పలువురికి గాయాలు

చేర్యాల(సిద్దిపేట): వీధికుక్క దాడిలో పలువురు గాయపడిన ఘటన పట్టణ కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాలుగో వార్డు పరిధిలో జరిగే ఓ వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన బంధువులపై ఓ వీధికుక్క దాడి చేసింది. దాడిలో 14 మంది గాయపడగా 12 మందికి స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందించి, ఇద్దరిని జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి పంపించినట్లు తెలిసింది. పట్టణ పరిధిలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి.

నూతన టెక్నాలజీతో కేసుల పరిష్కారం



సమీక్ష నిర్వహిస్తున్న ఏసీపీ నర్సింహులు

ఏసీపీ నర్సింహులు

గజ్వేల్‌రూరల్: కేసుల పరిష్కారంలో నూతన టెక్నాలజీని వినియోగించి, నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఏసీపీ నర్సింహులు సూచించారు. ప్రజ్ఞాపూర్‌లోని ఏసీపీ కార్యాలయంలో గురువారం డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నచిన్న సమస్యలకే ఆత్మహత్యలు చేసుకొని జీవితాలను నాశనం చేసుకోవద్దని, పోలీసులను సంప్రదిస్తే పరిష్కారం లభిస్తుందన్నారు. నిత్యం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని పోలీసులకు సూచించారు. పెండింగ్ కేసులు, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సీఐలు సైదా, లతీఫ్, మహేందర్‌రెడ్డి, అదనపు సీఐ ముత్యంరాజు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లొద్దు..

మర్కూక్(గజ్వేల్): ప్రాజెక్టులు, చెరువులలో ఈతకు వెళ్లి ప్రాణాలను పోగొట్టుకోవద్దని ఏసీపీ సూచించారు. కొండపోచమ్మ సాగర్ పరిసర ప్రాంతాలను గురువారం ఆయన రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, మర్కూక్ ఎస్‌ఐ దామోదర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ పిల్లలను ఈతకు వెళ్లకుండా తల్లిదండ్రులు చూసుకోవాలన్నారు. కొండపోచమ్మసాగర్ వద్ద శని, ఆదివారాలలో కూడా పెట్రోలింగ్ ముమ్మరం చేయడం జరిగిందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: అధికారంలోకి వచ్చిన యేడాదిన్నరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరుపై అన్ని వర్గాల ప్రజల్లోను వ్యతిరేకత కనిపిస్తోందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని పలు బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను క్యాంపు కార్యాలయంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో నిధులు లేక పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందన్నారు. కార్యదర్శులు అప్పులు తెచ్చి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం మొద్దునిద్ర వీడడంలేదని మండిపడ్డారు.

మహంకాళమ్మకు పూజలు

మండలంలోని తిమ్మాపూర్‌లో రెడ్డిసంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న మహంకాళమ్మ ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, సుప్రీమ్‌కోర్టు న్యాయవాది రామవరం చంద్రశేఖర్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కిషన్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, నరేశ్ తదితరులు ఉన్నారు.



మహంకాళమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

ప్రభుత్వ బడి తల్లిలాంటిది

ఏఎంఓ జిల్లా అధికారి భాస్కర్



విద్యార్థులు, తల్లిదండ్రులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు, అధికారులు

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ బడి తల్లిలాంటిదని విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ జిల్లా అధికారి భాస్కర్ అన్నారు. మండలంలోని సిర్సనగండ్ల ప్రాథమిక పాఠశాల పునః ప్రారంభ వేడుకలో గురువారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. హెచ్‌ఎం జయప్రకాశ్‌రెడ్డి పాఠశాలలో రూ.4 లక్షలతో వివిధ వసతులు కల్పించారు. పాఠశాలలో తమ పిల్లలను చేర్పించిన తల్లిదండ్రులు, విద్యార్థులకు ఉపాధ్యాయులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం భాస్కర్ మాట్లాడారు. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా తీర్చిదిద్దిన హెచ్‌ఎం జయప్రకాశ్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, హైస్కూల్ హెచ్‌ఎం పెద్ది విఠల్, పంచాయతీ రాజ్ మండల ఏఈ తిరుపతిరెడ్డి, హెచ్‌ఎం జయప్రకాశ్‌రెడ్డి, కార్యదర్శి స్వాతి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఫీడర్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోటిలింగాల ఆలయం, మారుతీనగర్, గాంధీనగర్, సంతోష్‌నగర్ తదితర ప్రాంతాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఐడీ కార్డుల కోసం డబ్బు వసూళ్లు

చర్యలు తీసుకోవాలంటున్న రైతులు

మర్కూక్(గజ్వేల్): ఐడీ కార్డుల కోసం మీ సేవ కేంద్రాలు, ప్రైవేట్ కేంద్రాల వద్ద రైతుల నుంచి రూ.50 నుంచి రూ.100 వసూలు చేస్తున్నారని రైతులు గురువారం ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఐడీ కార్డులను ఉచితంగా అందిచాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ అధికారులకు అప్పగించిందని, కాని వ్యవసాయ విస్తరణ అధికారుల మాత్రం తమ లాగిన్ వివరాలను మీ సేవ కేంద్రాలకు, ప్రైవేట్ కేంద్రాలకు అప్పగించారని వాపోయారు. ఆ కేంద్రాల ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని రైతులను పంపిస్తున్నారని, దీంతో వారు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. రైతులు కిషోర్‌రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న రైతులు

బాల కార్మిక వ్యవస్థపై పోరాడుదాం



ర్యాలీలో పాల్గొన్న శారద, రాములు, విద్యార్థులు

సీడీపీఓ శారద

సిద్దిపేటజోన్: బాల కార్మిక వ్యవస్థపై సమష్టిగా పోరాటం చేద్దామని సీడీపీఓ శారద, జిల్లా బాలల సంరక్షణశాఖ అధికారి రాములు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదరికం, నిరక్షరాస్యత, సామాజిక అసమానతల వల్ల చిన్నారులు కార్మికులుగా మారుతున్నారన్నారు. బడిఈడు పిల్లలను తప్పనిసరిగా బడికి పంపించాలని సూచించారు. 18 యేళ్లలోపు పిల్లలతో పని చేయించడం నేరమని, బాలల హక్కులు కాపాడే బాధ్యత మన అందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో బాల రక్షా భవన్ కో–ఆర్డినేటర్ మమత, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అయోధ్యరెడ్డి, శివకుమారి పాల్గొన్నారు.

భంగం కలగొద్దు

కొండపాక(గజ్వేల్): బాలల హక్కులకు భంగం కలగకుండా చూడాలని జిల్లా కోర్టు అడ్వకేట్ వెంకటేశ్ అన్నారు. మండలంలోని దుద్దెడలో హైస్కూల్లో కోర్టు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటళ్లు, పరిశ్రమలు, దుకాణాలు, ఇటుక బట్టీలు తదితర వాటిల్లో బాలలతో పనులు చేయించ వద్దన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు ఆలయంలోనే వస్త్రాలు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జునస్వామి, అమ్మవార్లకు ఆలయంలోనే మగ్గం ఏర్పాటుచేసి పోచంపల్లి పట్టువస్త్రాల నేతను ఆలయ ఈఓ అన్నపూర్ణ గురువారం ప్రారంభించారు. హైదరబాద్‌కు చెందిన భక్తులు మాల్యాల మధుసూదన్, సునీత దంపతులు స్వామి, అమ్మవార్లకు పోచంపల్లి పట్టు వస్త్రాలను ఆలయంలోనే తయారు చేయించి సమర్పించాలని ఆకాంక్షించారు. దీంతో పోచంపల్లికి చెందిన నేతవారిని సంప్రదించి మగ్గాలతో ఆలయానికి వచ్చి ఆలయ అధికారుల సహకారంతో వస్త్రాలు తయారు చేయడం ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ బుద్ది శ్రీనివాస్, ప్రధానార్చకుడు మల్లికార్జున్, ధర్మకర్తలు శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



వస్త్రాల నేతను ప్రారంభిస్తున్న ఈఓ అన్నపూర్ణ

సస్యరక్షణతో పంటలకు ఎంతో మేలు

సిద్దిపేటరూరల్: సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా రైతులకు ఎంతో మేలు కలుగుతుందని శాస్త్రవేత్తలు సూచించారు. మండల పరిధిలోని ఇర్కోడ్ గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్ట పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డా.శరత్‌చంద్ర, కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాస్, డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ స్వరూప రైతులకు పంటల సస్యరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు భూసార పరీక్షలు, విత్తనాల ఎంపికలో జాగ్రత్తల గురించి వివరించారు. మండల వ్యవసాయాధికారి నరేశ్, ఏఈఓ నవ్య తదితరులు పాల్గొన్నారు.

లద్నూరు రైతువేదికలో

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని లద్నూరు రైతు వేదికలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత డాక్టర్ శ్వేత, ఉమారాణి మాట్లాడుతూ అవసరం మేరకే రసాయన ఎరువులు వినియోగించాలన్నారు. పచ్చిరొట్ట ఎరువుతో భూసారం పెరుగుతుందని సూచించారు. కార్యక్రమంలో ఏఓ రామకృష్ణ, ఏఈఓలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ప్రకృతి వ్యవసాయంపై అవగాహన**

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటించాలని మండల వ్యవసాయాధికారి వసంతరావు సూచించారు. మండలంలోని అలిరాజపేటలో ప్రకృతి వ్యవసాయంపై మహిళా రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏఈఓ సాయి ప్రసన్న, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ **విస్తృత తనిఖీలు**

సిద్దిపేటకమాన్: గంజాయిని అరికట్టడానికి పట్టణంలోని పలు ప్రాంతాలలో నార్కోటిక్ డాగ్స్‌తో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టూటౌన్ సీఐ ఉపేందర్ మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎస్‌ఐ రాజేశం, హెడ్ కానిస్టేబుల్ సంజీవరెడ్డి, సిబ్బంది పరశురాములు, ప్రవీణ్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రభుత్వ నిర్ణయంపై హర్షం**

వర్గల్(గజ్వేల్): అర్చకులు, అర్చకేతర ఉద్యోగులకు, ధూప దీప నైవేద్య అర్చకులకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం తీసుకున్న చర్యలు హర్షిస్తూ నాచగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థాన ఈఓ విజయరామారావు ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం స్వామికి ప్రత్యేక అర్చన జరిపించారు. ఈ నిర్ణయంపై సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్, కమిషనర్ వెంకట్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ **నకిలీ విత్తనాల విక్రయాలపై చర్యలేవీ?**

గజ్వేల్‌రూరల్: నకిలీ విత్తనాలు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టి నకిలీ కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్వామి, రంగారెడ్డి, ఐలయ్య, స్వామి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

◆ **మూడు నెలలుగా అందని డబ్బులు**

బెజ్జంకి(సిద్దిపేట)/గజ్వేల్‌రూరల్: పొద్దుతిరుగుడు పంటను విక్రయించిన రైతులకు ప్రభుత్వం మూడు నెలలుగా డబ్బులు చెల్లించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్య పాకాల మహిపాల్‌రెడ్డి, గజ్వేల్‌లో ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ వాపోయారు. బెజ్జంకిలో గురువారం ఆయన మాట్లాడుతూ దుక్కులు దున్ని పెట్టుబడుల కోసం వేచి చూస్తున్న రైతుల డబ్బులు ఇవ్వకపోవడం దారుణం అన్నారు. లక్ష్మణ్, తిరుపతి, రాజయ్య, సంజీవరెడ్డి, మహేందర్‌రెడ్డి, ఐలయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌గౌడ్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్‌లో మూడేళ్ల శిక్షణ పొందేందుకు షెడ్యూల్ కులాలకు చెందిన లా పట్టభద్రుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కవిత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కల్గిన అభ్యర్థులు జూలై 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

◆ **విద్యుదాఘాతంతో గేదె మృతి**

బెజ్జంకి(సిద్దిపేట): విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని నర్సింహులపల్లె గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గూల్ల సంపత్‌కు చెందిన గేదె వ్యవసాయ భూమి సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ వైరుకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రూ.20 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. అధికారులు ఎర్తింగ్ వైరును తొలగించి మరమ్మతులు చేయాలని కోరారు.

◆ **ఎల్‌ఓసీ అందజేత**

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అల్వాలలో అనారోగ్యంతో బాధపడుతున్న పాపగారి స్వప్నకు వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ పత్రాలను కాంగ్రెస్ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి గురువారం అందజేశారు.